క్లుప్తంగా

18న చిత్రకళా పోటీలు

హన్మకొండ చౌరస్తా : ఈ నెల 18న వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో చిత్రకళా పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్‌లాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ నేతృత్వంలో కొనసాగే పోటీలు 'ప్రపంచ శాంతి–జాతీయ సమైక్యత' అంశంపై నాలుగు విభాగాల్లో ఉంటాయని తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కొనసాగే పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ఉదయం 7.30 గంటలకే పబ్లిక్‌గార్డెన్‌కు చేరుకోవాలని సూచించారు. పేర్ల రిజిస్ట్రేషన్ కోసం 81436 43337 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

అన్నదానం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని శ్రీ హరిహరపుత్ర శ్రీ ధర్మశాస్తా వారి (అయ్యప్పస్వామి) ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయస్వామి భక్తులు ఆలయ కమిటీ సభ్యులు,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రఘుపాల్‌రెడ్డి



హన్మకొండ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి–3గా నగరంలోని రెవెన్యూ కాలనీకి చెందిన కట్టా రఘుపాల్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. రెడ్డి సంఘం అభివృద్ధి కోసం రఘుపాల్‌రెడ్డి చేసిన కార్యక్రమాలను గుర్తించి తనను ఈ పదవిలో నియమించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

మడికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు పరామర్శించారు. వారం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన మడికొండకు చెందిన నర్ర నరేశ్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న అతడిని ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్తున్నట్లు తెలుపగా ఆసుపత్రి వర్గాలతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించే విధంగా చూడాలని సూచించారు. ఆయన వెంట పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, వస్కుల భాస్కర్, నాగరాజు, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

రేపటి నుంచి సమ్మర్ క్యాంప్‌లు

న్యూశాయంపేట : వరంగల్ గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (జీఐఓ) ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 22 వరకు సమ్మర్ ఇస్లామిక్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు జీఐఓ బాధ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో ముఖ్యంగా 13 నుంచి 30 సంవత్సరాల మధ్య గల బాలికలకు ఖురాన్ డిజైర్డ్ పర్సనాలిటీ, ఇన్‌స్పైరింగ్ స్టోరీలు, స్కిల్ డెవలప్‌మెంట్, మోటివేషన్ క్లాసులు తదితర వాటిపై తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ నగరంలోని ఎల్‌బీ నగర్, మండిబజార్, మసూమ్ అలీ స్ట్రీట్ ప్రాంతాల్లో క్యాంప్‌లు ఉంటాయన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందచేస్తామన్నారు. పూర్తి వివరాలకు 93989 10253, 81060 94070 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సత్యనారాయణకు డాక్టరేట్



నయీంనగర్ : చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగం పరిశోధకుడు చాడ సత్యనారాయణకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. గణితశాస్త్రంలో కన్వెక్టివ్ హీట్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ నానోఫ్లూయిడ్ ఫ్లో ఎ న్యూమరికల్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సత్యనారాయణకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు సీడీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎం.జగదీశ్వర్ తెలిపారు. డాక్టర్ సుందర్‌రామ్, డాక్టర్ మహ్మద్ షమ్షుద్దీన్‌ల పర్యవేక్షణలో సత్యనారాయణ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ఇ.విక్రమ్ రెడ్డి చాడ సత్య నారాయణను అభినందించారు.

'కార్మిక వ్యతిరేకి మోదీని గద్దె దించాలి'

న్యూశాయంపేట : కార్మిక వ్యతిరేకి ప్రధాని మోదీని గద్దె దించాలని, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని భారతీయ ఖేత్ మజ్‌దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు కోరారు. బుధవారం హనుమకొండలోని కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం ఎం.భిక్షపతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఎన్నో ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కోట్లాది మంది కూలీల పొట్టకొట్టిన దుర్మార్గ పాలకులకు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. సమావేశంలో మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, అయిలయ్య, భిక్షపతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు వేస్తే ఇవే చివరి ఎన్నికలు

● వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

హసన్‌పర్తి : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే ఇవే చివరి ఎన్నికలు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. ఎన్నికల్లో భాగంగా బుధవారం హసన్‌పర్తిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పౌరులకు ఓటు లేకుండా చేయడానికి యత్నిస్తోందన్నారు. ఎస్సీని ముఖ్యమంత్రిని చేస్తానని బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీలు అమలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్‌నర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, వీసం సురేందర్‌రెడ్డి, గడ్డం శివరాం ప్రసాద్, మదన్ గౌడ్, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, జీవన్‌రెడ్డి , ఎస్సీసెల్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

హన్మకొండ చౌరస్తా : కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ మహిళా నాయకురాలు కత్తుల కవిత ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఆయిల్, సీడ్స్, గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదేశాలతో 9వ డివిజన్‌లోని కాకతీయకాలనీ, న్యూరాయపుర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హామీల కరపత్రాలను పంపిణీ చేస్తూ అత్యధిక ఎంపీ స్థానాలను గెలిచి రాహుల్‌గాంధీని ప్రధాని చేసుకుందామని ఓటర్లను అభ్యర్థించారు. మహిళలకు రక్షణ, రిజర్వేషన్లు నిలబడాలంటే కాంగ్రెస్ రావాలని అన్నారు.



హన్మకొండ చౌరస్తా : చేతిగుర్తుకు ఓటెయ్యాలని వాహనదారుడిని కోరుతున్న కాంగ్రెస్ నేతలు

సభా ప్రాంగణంలో భారీ కటౌట్లు



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కటౌట్లు



తాగునీరు,మజ్జిగ ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న కార్యకర్తలు

ఖిలా వరంగల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వరంగల్ తిమ్మాపురం రోడ్డు లక్ష్మీపురం మైదానంలో జరిగిన ఓరుగల్లు జనసభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. సభా ప్రాంగణంలో బీజేపీ శ్రేణులు భారీగా ఎత్తైన కటౌట్లను ఏర్పాటు చేశారు. ప్రాంగణం చుట్టూ 30 ఫీట్ల ఎత్తుతో ప్రధాని మోదీతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ కటౌట్లను నిలబెట్టారు.

మజ్జిగ కోసం కుస్తీ

జనసభకు హాజరైన బీజేపీ కార్యకర్తలు, ప్రజలు ఎండ వేడికి తట్టుకోలేక తాగునీరు, మజ్జిగ కోసం కుస్తీ పట్టారు. దాహం తీర్చుకునేందుకు కార్యకర్తలు పోటాపోటీగా ఎగపడి ప్యాకెట్లను అందుకున్నారు. మజ్జిగ, తాగునీరు పంపిణీ కేంద్రాల్లో వలంటీర్లను తోసివేసి భారీకేడ్లను తెంచుకుని డ్రమ్ముల్లో వేసిన ప్యాకెట్లను ఎగబడి తీసుకున్నారు. ఈ సమయంలో వలంటీర్లు సైతం చేతులెత్తేశారు. మరికొంత మంది కార్యకర్తలు పక్కనే ఉన్న కిరాణం షాపుల్లో వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి దప్పిక తీర్చుకున్నారు.

తిరోగమన దిశలో మోదీ ఆర్థిక విధానాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

హన్మకొండ: నరేంద్ర మోదీ ఆర్థిక విధానాలు తిరోగమన దిశలో ఉన్నాయని తెలంగాణ పీపుల్స్ జాక్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. బుధవారం బాలసముద్రంలోని స్వగృహంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ముద్రించిన కరపత్రాలను ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో పేదల వ్యతిరేక ఆర్థిక విధానాలు అమలుపరిచిన మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల ప్రచారంలో స్విస్ బ్యాంకుల్లో ఉన్న లక్షలాది కోట్ల రూపాయల నల్లధనం తెచ్చి దేశంలోని పేద కుటుంబాలకు ప్రతి ఒక్కరికి రూ.15 లక్షల చొప్పున బ్యాంకు ఖాతాలో వేస్తానని చెప్పిన మోదీ ఆ హామీని విస్మరించారని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ బీసీల ప్రతినిధిని అని చెప్పుకుంటూ 27 శాతం బీసీల రిజర్వేషన్లు అమలు చేయకుండా 9 శాతానికి తగ్గించారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో 400 సీట్లలో గెలిపిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ పీపుల్స్ జాక్ కో కన్వీనర్ బి.రమాదేవి, జే.కళ, అర్జున్, జయంత్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి



ఖిలా వరంగల్: ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించలేని మోదీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని టీపీ జాక్ నాయకుడు రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం పడమరకోట అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాసంఘాలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీ జాక్ కళ, కంపెల్లి ప్రవీణ్, సంజీవ, కృష్ణ, చంద్రమౌళి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలపై నోరు మెదపని మోదీ

న్యూశాయంపేట : వరంగల్‌లో జరిగిన బీజేపీ ఎన్నికల సభలో ప్రధాని మోదీ విభజన హామీల అమలుపై నోరు విప్పకుండా మరోసారి ప్రజలను మోసం చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జిల్లా ముఖ్యకార్యకర్తలు ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్లలో అధికారంలో ఉన్న బీజేపీ వరంగల్‌కు ఏం ఒరగబెట్టారని ఓటెయ్యాలని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయని ఆరోపించారు. కుల, మతాల పేరుతో ఓట్లు దండుకుని అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జ్యోతి, కరుణాకర్, శ్రీనివాస్, ఎల్లేశ్, లక్ష్మణ్, బిక్షపతి, సారంపాణి,ఎ.శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఉద్యోగి ఉన్నతిలో నిజాయితీ ప్రధాన భూమిక

● కేయూ వీసీ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్: ఉద్యోగి ఉన్నతిలో నిజాయితీ, సమయపాలన ప్రధాన భూమిక వహిస్తాయని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. యూనివర్సిటీలో గత కొన్ని నెలలుగా పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినవారికి బుధవారం సెనేట్‌హాల్‌లో నిర్వహించిన సన్మానసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు తన పదవి కాలంలో చేసిన మంచి పనులు గీటురాయిగా ఉంటాయన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం మంచి జీవన విధానం, ఆర్థిక క్రమశిక్షణ, సానుకూల వాతావరణం ఏర్పాటుచేసుకోవటం తద్వారా తదుపరి జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో కేయూ మాజీ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, కె.విజయబాబు, టి.సుమతి ఉమామహేశ్వరి, కె.రాజిరెడ్డి, బన్న అయిలయ్యలను సన్మానించారు. అలాగే బోధనేతర ఉద్యోగుల్లో పరీక్షల విభాగం సూపరింటిండెంట్ ఆర్.అరుణకుమారి, ఎస్.మనోహర్‌రావు, మహ్మద్ జమాల్ పాషా, సాయిలు, వీసీ, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ ఉద్యోగులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు దివ్యాంగుల జేఏసీ మద్దతు

నయీంనగర్ : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు తెలంగాణ దివ్యాంగుల సంఘాల జేఏసీ మద్దతు తెలిపింది. బుధవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో జేఏసీ కన్వీనర్ డాక్టర్ నారా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ బీజేపీ వికలాంగులకు ఏమీ చేయలేదని ఖాళీగా ఉన్న వికలాంగుల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదన్నారు. జాతీయ స్థాయిలో వికలాంగుల ప్రధాన కమిషనర్ పోస్ట్, జాతీయ ట్రస్ట్‌కు చైర్మన్‌ను కూడా బీజేపీ ప్రభుత్వం నియమించలేదన్నారు. కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల ఐక్యవేదిక అధ్యక్షుడు పల్లెబోయిన సుధాకర్, నాగభూషణం, ప్రశాంత్, పాషా, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన 'సహృదయ' నిర్వాహకురాలు



వృద్ధురాలిని చేరదీసిన ఆశ్రమం నిర్వాహకులు

కాజీపేట: ఎండ వేడిమికి తాళలేక..తిండి తిప్పలు లేక రహదారి పక్కన స్పృహ తప్పి పడిపోయిన ఓ వృద్ధురాలిని సహృదయ అనాథ ఆశ్రమ నిర్వాహకులు చేరదీసి ఆశ్రమానికి తరలించి మానవత్వాన్ని చాటుకున్న ఘటన బుధవారం హనుమకొండలో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హనుమకొండ విజయటాకీస్ రోడ్డులో ఓ వృద్ధురాలు పడి ఉండగా గుర్తించి చలించిన పశుసంవర్ధక శాఖ ఉద్యోగి రాజేందర్ ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ అనాథ ఆశ్రమానికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించాడు. ఆశ్రమ నిర్వాహకురాలు ఎండీ. యాకుబీ వెంటనే ప్రత్యేక వాహనంలో విజయ టాకీస్ రోడ్డుకు వచ్చి వృద్ధురాలికి వైద్య చికిత్స చేయించారు. కొద్దిసేపటి తర్వాత వృద్ధురాలు స్పృహలోకి వచ్చి మా ఊరు హనుమకొండ గోపాలపురం, నా పేరు కొమురమ్మ అని నాకు ఒక కొడుకు, ముగ్గురు కూతుర్లు ఉన్నారని చెప్పింది. ఆదరించే వారు లేరని కన్నీళ్లు పెట్టుకోవడంతో చూపరుల హృదయాలను కదిలించింది. వృద్ధురాలిని ఆశ్రమానికి తరలించిన యాకుబీ కుటుంబ సభ్యులు ఎవరైనా స్పందించి 97010–46223 నంబర్‌కు ఫోన్ చేసి వృద్ధురాలిని ఇంటికి తీసుకెళ్లవచ్చని యాకుబీ తెలిపింది.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో జరిగే 26వ రజతోత్సవాల ఆహ్వాన పత్రికలను బుధవారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లుశర్మ భక్తులతో కలిసి ఆవిష్కరించారు. ఆలయ సమావేశ మందిరంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ స్వామివారి పుట్టిన రోజును పురస్కరించుకుని కనులపండువగా సాగే ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామివారికి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి ఆశీస్సులతో ఈనెల 12న పుత్రకామేష్టి యాగం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు సాయికృష్ణశర్మ, ఆల య మేనేజర్ రవి, శ్రీనివాసశర్మ, అరుణ్‌రెడ్డి, శ్రీని వాస్, రజిత, కె.భాస్కర్, సుజాత, సీనమ్మ, చందు, కవిత, రాధా, జయమ్మ, అనురాధ, అర్చకులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న భక్తులు

సంక్షేమ సంఘం మద్దతు

న్యూశాయంపేట : వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వరంగల్ జిల్లా కొండా సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌ఖార్ తెలిపారు. బుధవారం వరంగల్‌లో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వరంగల్‌లో అన్ని వర్గాలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ గెలుపుకోసం కరీమాబాద్, చింతల్, దేశాయిపేట, ఎల్‌బీ నగర్ గరీబ్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హుజా, మహ్మద్ అక్బర్, మహమూద్ పాల్గొన్నారు.

దేశాయిపేటలో కాలభైరవ విగ్రహాల ధ్వంసం

దేశాయిపేట: దేశాయిపేటలోని కాలభైరవ దేవాలయంతో పాటు విగ్రహాలను మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలిసిన వెంటనే రాత్రి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు తెలిసింది. దేవాలయంలో 31 ఫీట్ల కాలభైరవుని విగ్రహం దాని పక్కనే నిత్యం పూజలు అందుకునే కాలభైరవుని శిలా విగ్రహం ఉన్నాయి. దేవాలయం మూల విరాట్ కాలభైరవుని ఉపాలయాన్ని అసాంఘిక శక్తులు ధ్వంసం చేసి విగ్రహాన్ని, కూలదోసినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం ఉదయం వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, కార్పొరేటర్ కావటి కవితాయాదవ్, గ్రామపెద్దలు, భక్తులు ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. స్థానికులు గతంలో ఇలాంటి దాడులు చేశారని, ఈఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా చర్యలు తీసుకొని శిక్షించాలని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.



ధ్వంసమైన విగ్రహం

సంక్షిప్త సమాచారం

కార్మికులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



కాజీపేట రూరల్ : వేసవి కాలంలో రైల్వే కార్మికులు ఎండవేడిని తట్టుకునేందుకు పలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని డీజిల్ కాలనీ రైల్వేపాలిక్లినిక్ డాక్టర్ ధీరజ్‌కుమార్ అన్నారు. కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో బుధవారం రైల్వే కార్మికులకు వేసవి జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు విధుల్లో, బయటికి వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్మికులకు 500 ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం ధీరజ్‌కుమార్‌ను రైల్వేమజ్దూర్ యనియన్, రైల్వే సంఘ్ నాయకులు సన్మానించారు.

మోదీ జనసభకు బయలుదేరిన కార్యకర్తలు


మడికొండ : ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్‌లో బుధవారం జరిగిన ప్రధాని మోదీ జనసభకు గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ నుంచి భారీగా కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు పొనగోటి వెంకట్‌రావు జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు.

బీజేపీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్



కాశిబుగ్గ : బీజేపీతోనే దేశంలోని యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో యువత పెద్దఎత్తున ఓరుగల్లు జనసభకు వాహనాల ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వినీత్ రావు మాట్లాడుతూ మరోసారి మోదీని ప్రధానిగా చేయాలని దానికి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో చేరికలు



హన్మకొండ : హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీ ఆటో యూనియన్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం విశాల్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాలనీ ఆటోయూనియన్ అధ్యక్షుడు బత్తిని రవి, బీజేపీ నాయకులు పుప్పాల ప్రవీణ్, నిమ్మ, ఈశ్వర్, దువ్వ ప్రవీణ్ కాంగ్రెస్ నాయకుడు నాయిని లక్ష్మారెడ్డి నేతృత్వంలో 51వ డివిజన్ అధ్యక్షుడు కొండ నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా కుండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆటో యూనియన్ కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు



వరంగల్ లీగల్ : హనుమకొండ జిల్లా ప్రధానన్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్.రమేష్‌బాబును బుధవారం కోర్టులోని తన చాంబర్‌లో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందించి అభినందనలు తెలిపారు. కలిసిన వారిలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తీగల జీవన్‌గౌడ్, ముదసర్ అహ్మద్, ఉపాధ్యక్షులు సుదర్శన్, సెక్రటరీ వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

మహిళలు, బాలికల రక్షణకు సఖి సేవలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వినీల

హన్మకొండ అర్బన్ : మహిళలు, బాలికల రక్షణ కోసం సఖి కేంద్రం సేవలు అందిస్తున్నట్లు సఖి వన్ స్టాప్ కేంద్రం కౌన్సిలర్ విజయలక్ష్మి, కేస్ వర్కర్ వినీల విద్యార్థినిలకు సూచించారు. బుధవారం నగరంలోని జులైవాడలోని ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లోని సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురవుతున్న చిన్నపిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం 'ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్' తీసుకురావడం జరిగిందని తెలిపారు. సమస్యలపై సహాయం కోసం సఖి కేంద్రానికి వచ్చే మహిళలకు ఉచిత కౌన్సిలింగ్, న్యాయ, పోలీస్, వైద్యసాయంతో పాటు తాత్కాలిక వసతి అందించనున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలు ఆపద సమయంలో ఫోన్ నెంబర్ 0870–2452112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేసి సాయం పొందాలని కోరారు. ఎ.శ్రీదేవి, హాస్టల్ వార్డెన్ మల్లమ్మ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో ఒక ప్రయాణికుడికి రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఆర్‌పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే ప్రయాణికుల వెయిటింగ్ హాల్‌లో రా మస్వామి తన సెల్‌ఫోన్‌ను చార్జింగ్ పెట్టి ఎంక్వైరీ కౌంటర్ వద్దకు వెళ్లి వచ్చేసరికి సెల్‌ఫోన్ కనిపించలేదు. అంతకు ముందు వెయిటింగ్ హాల్‌లో సెల్‌ఫోన్ వద్ద ఎవరూ లేకపోవడంతో ప్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌లో అప్పగించారు. తన సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో ఫిర్యాదు చేయగా ప్రయాణికుడికి ఫోన్‌ను అప్పగించినట్లు సీఐ తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోరుతూ ప్రచారం

హసన్‌పర్తి: వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగరంలోని 1, 55, 65, 66వ డివిజన్లలో ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి, పార్టీల డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, అటికం రవీందర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, విక్టర్‌బాబు, దేవస్థాన మాజీ చైర్మన్ లక్ష్మణ్, యుగంధర్, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాశిబుగ్గ : డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని 19వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు చిలువేరు పవన్ కోరారు. బుధవారం డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. క్యాతం రంజిత్, కిరణ్‌నాయక్, చెన్నూరి కిషోర్, చిరంజీవి, హరీష్, పాపయ్య, రాజ్ కిరణ్, బాలు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కాశిబుగ్గ : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపల్లి సావిత్రిని గెలిపించాలి

హన్మకొండ: నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల మధ్య ఉంటూ ప్రశ్నించే ప్రజాగొంతుక వరంగల్ ఎంపీ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బలపరిచిన ఎంసీపీఐ(యూ) అభ్యర్థి కొత్తపల్లి సావిత్రిని గెలిపించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సావిత్రిని గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో సంపదను ఉన్నత వర్గాలకు దోచి పెడుతున్నాడని, అంబానీ, అదానీలకు ప్రభుత్వరంగ సంస్థల్ని కట్టబెడుతున్నారన్నారు. మతం, దేవుళ్ల పేరుతో విభజిస్తూ పాలన సాగిస్తున్నాడని విమర్శించారు. సావిత్రి కంప్యూటర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మొగిలి శ్రీనివాసరావు, నాయకులు మట్టెడ మొగిలి, శేఖర్, కుమార్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.